క్లుప్తంగా

ఆంగ్లభాషపై పట్టు సాధిస్తేనే అవకాశాలు



మాట్లాడుతున్న సీనియర్ అధ్యాపకుడు డాక్టర్ నగేష్

అద్దంకి రూరల్: ఏరంగంలో రాణించాలన్నా ఆంగ్ల బాషా కీలకమైందని.. ఆ భాషపై విద్యార్థులు పట్టు సాధించాలని దర్శి కళాశాల సీనియర్ అధ్యాపకుడు డాక్టర్ ఏ నగేష్ అన్నారు. మంగళవారం అద్దంకిలోని కేఆర్కే డిగ్రీ కళాశాలలో డిపార్ట్ మెంట్ ఆఫ్ ఇంగ్లీష్, జవహర్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో ఆంగ్లభాష ప్రాధాన్యత అనే అంశంపై అతిథి అధ్యాపక సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సత్యనారాయణ, జేకేసీ మెంటార్ వినుకొండ రమేష్, డాక్టర్ ఎస్ షర్మిలారాణి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హెల్మెట్ భారమనుకుంటే ప్రాణాలకే ముప్పు

వేటపాలెం: వాహనాలు నడిపే యువకులు హెల్మెట్ తలకు భారమనుకుంటే అది ప్రాణాలకే ముప్పుగా మారుతుందని చీరాల డీఎస్పీ మహమ్మద్ మొయిన్ హెచ్చరించారు. స్థానిక సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో రహదారి భద్రతపై అవగాహన సమావేశం మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఎస్పీ హాజరై మాట్లాడుతూ.. ద్విచక్రవాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. రూరల్ సీఐ శేషగిరిరావు మాట్లాడుతూ రహదారి భద్రతా నియమాలను వాహనదారులు తప్పనిసరిగా పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై వెంకటేశ్వర్లు, కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ ఎస్ లక్ష్మణరావు, ప్రిన్సిపాల్ కే జగదీశ్ బాబు విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధి కార్యక్రమాలపై సర్వే

యద్దనపూడి: అభివృద్ధి కార్యక్రమాలపై నిర్వహిస్తున్న సర్వేలను త్వరితగతిన పూర్తి చేయాలని బాపట్ల డీఎల్‌డీఓ ఇన్‌చార్జ్ జీఎస్‌డబ్ల్యూఎస్ ఇన్‌చార్జ్ సీహెచ్ విజయలక్ష్మి అన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం ద్వారా సూచనలు ఇచ్చారు. సచివాలయ ఉద్యోగుల హాజరు, ఎంఎస్ఎంఈ సర్వే, హౌస్ హోల్డ్ సర్వే, ఆధార్ లేని చిన్నారులు, మిస్సింగ్ సిటిజన్ సర్వేల గురించి త్వరితంగా పూర్తి చేయాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ లక్ష్మీనారాయణ, ఈఓపీఆర్డీ కృష్ణ పాల్గొన్నారు.

శివరాత్రికి ముస్తాబైన శైవక్షేత్రాలు



కారంచేడు శివాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు



అద్దంకిలోని మణికేశ్వర దేవాలయం

● నేడు మహాశివరాత్రి

కారంచేడు/యద్దనపూడి: మహా శివరాత్రి మహోత్సవాలకు శైవాలయాలు ముస్తాబవుతున్నాయి. బుధవారం వేకువజాము నుంచి గురువారం వేకువజాము వరకు నిర్వహించే వివిధ రకాల పూజా కార్యక్రమాల కోసం భక్తులు, ఆలయ అర్చకులు, ఆలయాల అభివృద్ధి కమిటీల సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. మండల కేంద్రం కారంచేడు పెద బజారు శివాలయంగా పేరుగాంచిన 100 ఏళ్లకు పైగా ఎంతో విశిష్టత కలిగిన గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామివారి ఆలయంలో ఉదయం 5 గంటల నుంచి పంచామృతాభిషేకాలు, ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అర్ధ ఏకాహం, 11 గంటల నుండి తెల్లవారుజామున 5 గంటల వరకు మహా రుద్రాభిషేకములు నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. అనంతరం స్వామి వారి శాంతి కల్యాణాన్ని నిర్వహిస్తామని అర్చకులు కారంచేటి వీరాంజనేయశర్మ తెలిపారు.

■ యద్దనపూడి మండలంలోని గన్నవరం అన్నపూర్ణా సమేత కాశీ విశ్వేశ్వరస్వామి, యద్దనపూడి రామలింగేశ్వరస్వామి, పూనూరులోని త్రిపురసుందరి సమేత త్రిపురాంతకస్వామి, అనంతవరం బోగమల్లేశ్వరస్వామి ఆలయాల్లో ఉదయం 5గంటల నుంచే మహాదేవునికి మహాన్యాసపూర్వక ఏకరుద్రాభిషేకాలు, ప్రత్యేక అలంకరణలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు తెలిపారు.

అద్దంకి: పట్టణ సమీపంలోని దక్షిణ కాశిగా పేరుగాంచిన మణికేశ్వరంలోని మల్లీశ్వరస్వామి దేవస్థానం మహాశివరాత్రి వేడుకలకు ముస్తాబైంది. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చే భక్తుల కోసం ఆలయంలో ప్రత్యేక క్యూలైన్లు, పక్కనే ఉన్న గుండ్లకమ్మ నది వద్ద స్నాన ఘట్టాలు ఏర్పాటు చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా దేవాదాయ శాఖ, దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో పర్యవేక్షణ చేయనున్నారు. అద్దంకి–నార్కెట్‌పల్లి రాష్ట్రీయ రహదారిలో కొంగపాడు డొంక నుంచి రెండు కిలోమీటర్ల దూరంలో ఈ ఆలయం ఉంది.

బాలకోటేశ్వరాలయానికి చేరిన ప్రభ



ఆలయం ఎదుట నిలిపి ఉంచిన నారాయణ ప్రభ

చినగంజాం: శివరాత్రి పండుగను పురస్కరించుకొని దశాబ్దాలుగా ఆనవాయితీగా వస్తున్న నారాయణ ప్రభ సోమవారం అర్ధరాత్రి బాలకోటేశ్వర స్వామి ఆలయం వద్దకు చేరుకుంది. నారాయణ ప్రభ ఆలయానికి రెండు రోజుల ముందుగా వచ్చే సాంప్రదాయాన్ని కోకి వంశస్తులు యాథావిధిగా నిర్వహించారు. మున్నంవారిపాలెం గ్రామంలో నిర్మాణం చేసుకొని సోమవారం సాయంత్రం గ్రామం నుంచి ఊరేగింపుగా బయలు దేరి అర్ధరాత్రి సమయానికి గుడి చెంతకు చేర్చారు. ఇందుకోసం డీజేలతో బాణసంచా కాలుస్తూ మున్నం వారి పాలెం, చినగంజాం, కొత్తపాలెం పంచాయతీలోని మూలగాని వారిపాలెం గ్రామాల మీదుగా ఊరేగింపు నిర్వహించారు. కోకి వంశీయులతో పాటు పలువురు భక్తులు ఊరేగింపులో పాల్గొన్నారు.

పాఠశాలకు కుర్చీలు, బీరువా అందజేత



కుర్చీలు, బీరువా అందజేస్తున్న క్లబ్ సభ్యులు

అద్దంకి రూరల్: రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఎన్టీఆర్ కాలనీలోని ఎంపీపీ పాఠశాలకు రూ.10 వేల విలువ కలిగిన కుర్చీలు, బీరువాను బహూకరించారు. రోటేరియన్ కోట అంజమ్మకు అందజేశారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, సెక్రటరీ చుండూరి మురళీ సుధాకరావు, ట్రెజరర్ మలాది ఎనివాసరావు, కౌన్సిలర్ గుంజి కోటేశ్వరరావు, కోనేటి అనిల్, సందిరెడ్డి శ్రీనివాసరావు, చిన్ని మురళీకృష్ణ, ఊటుకూరి రామకోటేశ్వరరావు, అన్నంగి సుబ్బారావు, అంజాద్‌బాషా, అలహరి హరిప్రసాద్, దాత గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

రైతు విశిష్ట గుర్తింపుతోనే పథకాలు



పుల్లరిపాలెంలో మాజమాన్య పద్ధతుల పుస్తకాలు అందుకున్న రైతులు

పర్చూరు (చినగంజాం): పంట సాగు చేసే ప్రతి ఒక్క రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పనిసరిగా తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎస్ రామ్మోహన రెడ్డి అన్నారు. మండలంలోని నాగులపాలెం, ఏదుబాడు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రైతులకు విశిష్ట సంఖ్య నమోదు కోసం తప్పనిసరిగా రైతు సేవా సిబ్బందిని సంప్రదించాలని తెలియజేశారు. విశిష్ట సంఖ్యపొందిన రైతులు అందరూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్, సబ్సిడీపై యంత్ర పరికరాలు, మద్దతు ధరకు పండించిన ఉత్పత్తిని అమ్ముకోవడానికి ఉపయోగపడుతుందని తెలియజేశారు. కార్యక్రమంలో రైతు సేవా సిబ్బంది హేమవర్ధిని, నందిని, లావణ్య రైతులు పాల్గొన్నారు.

■ ఇంకొల్లు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ఏవో వేణుగోపాల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమి ఉన్న రైతులందరూ ఫిబ్రవరి 28 లోపు రైతు సేవా కేంద్రంలో ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఆయన కోరారు.



నాగులపాలెంలో మిరప పంటలను పరిశీలిస్తున్న అధికారులు

వ్యవసాయ పథకాలకు రిజిస్ట్రేషన్ అవసరం..

వేటపాలెం: ప్రభుత్వం రైతులకు అందించే అన్ని పథకాలకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఐ కాశీవిశ్వనాథ్ పేర్కొన్నారు. పుల్లరిపాలెం పంచాయతీ పరిధిలోని బచ్చులవారిపాలెం, ఊటుకూరి సుబ్బయ్యపాలెంలో విజయవాడకు చెందిన సేంద్రియ సమగ్ర సస్యరక్షణ కేంద్రం వారిచే రైతులకు క్షేత్ర స్థాయిలో వివిధ పంటలపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఏవో మాట్లాడుతూ రైతులకు పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకాలు అమలు కావాలంటే తప్పని సరిగా రిజిస్టర్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో వీరయ్య చౌదరి, ప్రేమరంజిత, రైతులు పాల్గొన్నారు.

కూలీలందరికీ ఉపాధి పనులు

చీరాల టౌన్: ఉపాధి పనులను పెంచి ప్రతి ఒక్కరికీ పనులు కల్పిస్తామని ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో దాసు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని తోటవారిపాలెం, పిట్టువారిపాలెం గ్రామ పంచాయతీలో సచివాలయాల అడ్మిన్లు, డిజిటల్ అసిస్టెంట్లతో కలిసి ఉపాధి పనుల సంఖ్య పెంపుదలపై సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఏపీవో మాట్లాడుతూ.. గ్రామాల నుంచి ఎవరూ ఇతర ప్రాంతాలకు వలస వెళ్లకుండా చర్యలు తీసుకుని ప్రతి కూలీకి జాబ్‌కార్డు అందించి ఉపాధి పనులకు వచ్చేలా చర్యలు చేపడుతున్నామన్నారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు, ఎన్ఆర్ఈజీఎస్ ఫీల్డు అసిస్టెంట్లు, సచివాలయాల ఉద్యోగులు పాల్గొన్నారు.

నాణ్యత లేకుంటే చర్యలు తప్పవు

కారంచేడు: గ్రామాల్లో నూతనంగా నిర్మాణాలు చేపడుతున్న సీసీ రోడ్లు నాణ్యత ప్రమాణాలు పాటించి వేయాలని లేకుంటే చర్యలు తీసుకుంటామని పంచాయితీరాజ్ ఏఈ సీహెచ్ రామచంద్రుడు హెచ్చరించారు. మంగళవారం ఆయన మండలంలోని పలు గ్రామాల్లో నిర్మాణాల్లో ఉన్న సీసీ రోడ్లను పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా, నాణ్యతలో డొల్లతనంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని, బిల్లులు సైతం నిలుపుదల చేస్తామని ఆయన హెచ్చరించారు. స్వర్ణ గ్రామంలో వేస్తున్న సీసీ రోడ్డును కూడా ఆయన దగ్గరుండి నాణ్యత లోపాలు లేకుండా చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో సిబ్బంది ఉన్నారు.

ముగిసిన జ్ఞానజ్యోతి శిక్షణ



శిక్షణలో మాట్లాడుతున్న ఎంఈవో- 2

బల్లికురవ: జ్ఞానజ్యోతి శిక్షణలో నేర్చుకున్న అంశాలను అమలతో చిన్నారులకు నాణ్యమైన విద్యను అందించాలని ఎంఈవో–2 కె. రమేష్‌బాబు కోరారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు వారం రోజులుగా బల్లికురవలో జరుగుతున్న శిక్షణ మంగళవారం సాయంత్రంతో ముగిసింది. పీపీ–1,2 మెడిటేషన్, యోగా, సంసిద్ధత కార్యాక్రమాలు టీఎల్ఎం అవగాహన కల్పించారు. శిక్షణలో సూపర్‌వైజర్ విజయకుమారి, రిసోర్స్ పర్సన్స్ సురేష్, రామకృష్ణ పాల్గొన్నారు.

చీరాలలో అత్యాధునిక డెంటల్ వసతులు



క్లినిక్ ప్రారంభిస్తున్న సుబ్బారావు, అమృతపాణి

చీరాల రూరల్: ప్రకాశ్ డెంటల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో మంగళవారం నూతనంగా చర్చిరోడ్డులో అబ్రహమ్స్ డెంటల్, ఈస్థిక్ (బూటిషియన్) క్లీనిక్ బ్రాంచ్‌ను దంత వైద్యులు డాక్టర్ అబ్రహం, డాక్టర్ సజీనా అబ్రహంలు ప్రారంభించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) ప్రెసిడెంట్ డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ గోరంట్ల సుబ్బారావు, డాక్టర్ వరికూటి అమృతపాణి, డాక్టర్ పి. శ్రీకాంత్, డాక్టర్ ప్రమీల, డాక్టర్ భానుమతి, అమెరికాకు చెందిన ప్రముఖ దంత వైద్యులు డాక్టర్ జెర్రీ రొష్, డాక్టర్ సుఖ్‌దీప్ చాహల్ సింగ్‌లు హాజరై క్లీనిక్‌లోని వివిధ విభాగాలను ప్రారంభించారు. నూతనంగా ప్రారంభించిన ఈ క్లీనిక్‌లో హైదరాబాద్, చెన్నై, బెంగళూరు వంటి మహా నగరాలలోని పెద్దాసుపత్రుల తరహాలో వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. చీరాల, పరిసర ప్రాంత ప్రజలు ఈ వైద్య సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో క్లినిక్ నిర్వాహకులు డాక్టర్ మేడికొండ అబ్రహం బ్లెస్సీ, డాక్టర్ సజీనా ప్రకాష్‌బాబు, ఎం. కవిత, ఐఎంఏ, ఐడీఏలకు చెందిన వైద్యులు పాల్గొన్నారు.

పంటమార్పిడితో ఉపయోగాలు

బల్లికురవ: రైతులు పత్తి, మిరప, కంది, సాగు చేసే భూముల్లో పంట మార్పిడి విధానాన్ని అవలంబించాలని మార్టూరు వ్యవసాయ శాఖ ఏడీఏ కేవీ శ్రీనివాసరావు వెల్లడించారు. మంగళవారం వేమవరం, కొప్పరపాలెం గ్రామాల్లో పంటలను పరిశీలించారు. పంటమార్పిడితో చీడపీడలను నివారించుకోవచ్చన్నారు. రబీలో సాగుచేసే పంటలను మార్చి 3 తేదీలోపు ఈ–క్రాప్‌తో నమోదు చేసుకోవాలని వివరించారు. కార్యక్రమాల్లో ఏవో ఎస్‌పీపి కుమారి పాల్గొని మాట్లాడారు.

గ్రామ సచివాలయంలో కంప్యూటర్ మాయం

వేటపాలెం: స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం ప్రాంగణంలో గల గ్రామ సచివా లయం–2లో కార్యాలయంలో ఒక కంప్యూటర్ దొంగతనం జరిగినట్లు సెక్రటరీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. శనివారం, ఆదివారం రెండు రోజులు సెలవులు రావడంతో సచివాలయ కార్యాలయానికి తాళాలు వేసి ఉంచారు. సోమవారం ఉదయం సిబ్బంది వచ్చి చూడగా ఉండాల్సిన నాలుగు కంప్యూటర్లలో ఒక కంప్యూటర్ కనిపించలేదు. విషయాన్ని పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లగా కార్యదర్శి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సై వెంకటేశ్వర్లు ఘటనా స్థలాన్ని పరిశీలించి సచివాలయ సిబ్బంది, సచివాలయం పక్కనే ఉన్న మంచినీటి పైలెట్ ప్రాజెక్టుకు పని చేస్తున్న సిబ్బందిని విచారించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఐదు, ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

యద్దనపూడి: మండల కేంద్రమైన యద్దనపూడిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి ఐదు, ఇంటర్ ప్రథమ సంవత్సరం తరగతుల ప్రవేశానికి ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ కే ప్రమీలా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తరగతుల మెత్తం ఇంగ్లిష్ మీడియంలో ఉంటాయని పేర్కొన్నారు. దీనికి సంబంధించి ఐదో తరగతిలో 80 సీట్లు ఉండగా, ఎస్సీలకు 60 సీట్లు, హరిజన క్రిస్టియన్ (బీసీ–సీ) 10 సీట్లు, ఎస్టీలకు 5 సీట్లు, బీసీలకు 4 సీట్లు , ఓసీలకు 1 సీటు రిజర్వేషన్ల ప్రకారం సీట్లను భర్తీ చేస్తామన్నారు. అలాగే ఇంటర్ బైపీసీలో 40 సీట్లు, ఎంపీసీలో 40 సీట్లు ఉంటాయన్నారు. కుల రిజర్వేషన్ ప్రాతిపదికన సీట్లు భర్తీ చేస్తామని వివరించారు. ఏప్రిల్ 6 తేదీలోపు httpr://apbrafcet.apcfrr.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 97045 50095 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

ఎన్‌సీసీ ద్వారా నాయకత్వ లక్షణాలు

వేటపాలెం: ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ఏ ద్వారా విద్యార్థులు చిన్న వయసులోనే జాతీయ సమైక్యతతో పాటు సేవాభావం, నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవచ్చని విశ్రాంత అసోసియేట్ ప్రొఫెసర్ కడెం రాయుడు పేర్కొన్నారు. పందిళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో విద్యార్థులకు ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ పాత్రపై అవగాహన సమావేశం మంగళవారం నిర్వహించారు. ఎన్‌సీసీ ద్వారా స్వీయ రక్షణ, సామాజిక సేవ, నాయకత్వ లక్షణాలు జీవన విధానంలో ఆరోగ్య పరిరక్షణ, మానసిక ఒత్తిడిని ఎలా అధిగమించాలనే దానిపై వివరించారు. అనంతరం ముఖ్య అతిథికి ఉపాధ్యాయులు ఘనంగా సన్మానం చేసి సత్కారించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శేఖర రావు, సుబ్రహ్మణ్యం, విశ్రాంత టీసీఎల్ మేనేజర్ జయచంద్ర వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మణికేశ్వరం ఏర్పాట్లను పరిశీలించిన సీఐ

అద్దంకి రూరల్: శివరాత్రి పండుగ సందర్భంగా మండలంలోని మణికేశ్వరం గ్రామంలోని మల్లేశ్వరస్వామి దేవస్థానాన్ని మంగళవారం రాత్రి దేవస్థానంలో ఏర్పాట్లను సీఐ సుబ్బరాజు పరిశీలించారు. క్యూలైన్లు, స్వామివారి దర్శనానికి వచ్చి రాత్రి జాగారాలు చేసే భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయాలని దేవస్థాన అధికారులకు సూచించారు. ఈకార్యక్రమంలో దేవస్థాన ఈవో, సిబ్బంది పాల్గొన్నారు.

భవానీ సెంటర్‌లో స్పీడు బ్రేకర్ల ఏర్పాటు



స్పీడు బ్రేకర్ల ఏర్పాటును పర్యవేక్షిస్తున్న సీఐ సుబ్బరాజు

అద్దంకి: ప్రమాదాల నివారణ, వేగ నిరోధం కోసం పట్టణంలోని భవానీ సెంటర్‌లో స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేశామని సీఐ సుబ్బరాజు మంగళవారం తెలిపారు. ఈ స్పీడు బ్రేకర్లను నామ్ హైవే కూలీల చేత ఏర్పాటు చేయించినట్లు తెలిపారు. పలు రహదారుల కూడలి ప్రాంతం అయినందున వాహనదారులు ఈ ప్రదేశంలో తక్కువ వేగంతో వాహనాన్ని నడపాలని కోరారు. ట్రాఫిక్ సమస్య, ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు.

అంగరంగ వైభవంగా చినగంజాం మహాశివరాత్రి తిరునాళ్లు

● తిరునాళ్లలో పోలీసులకు సహకరించాలి



శీలం రమేష్, చినగంజాం ఎస్సై

చినగంజాం: మహాశివరాత్రి సందర్భంగా మండలంలోని సోపిరాల రామకోటేశ్వరాలయం తిరునాళ్లను అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. ఈ తిరునాళ్లకు రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు భారీ ఎత్తున్న తరలి రానున్నారు. తిరునాళ్ల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ ఘటలు చోటు చేసుకోకుండా భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఎస్సై శీలం రమేష్ తెలిపారు. ప్రధానంగా తలెత్తే ట్రాఫిక్ సమస్యను ఎదుర్కొనేందుకు అన్ని చర్యలు తీసుకున్నట్లు ఆయన తెలిపారు. పూలవారిపాలెం గ్రామం వద్ద జాతీయ రహదారికి వెళ్లే రోడ్డు మూసివేశామన్నారు. కడవకుదురు గ్రామం వైపు నుంచి వచ్చే ఆటోలు, ట్రాక్టర్‌లు అన్ని కళ్యాణ మండపం వద్ద పార్కింగ్ చేయాల్సిందిగా సూచించారు. జాతీయ రహదారి టీ జంక్షన్ నుంచి ఆటోలు, ట్రాక్టర్‌లు అన్ని హోండా షోరూం వద్ద పార్కింగ్ స్థలంలో నిలపాలని చెప్పారు. సోపిరాల రైల్వే గేటు నుంచి మొలకా రెడ్డి విగ్రహం వరకు భక్తుల సౌకర్యార్థం వన్‌వేగా నిర్ణయించామని, ఎటువంటి వాహనాలు ఎదురు వెళ్లకూడదన్నారు. సోపిరాల రైల్వే గేట్ నుంచి పల్లెపాలెం వైపు వెళ్లే రోడ్డును వనవేగా నిర్ణయించినట్లు చెప్పారు. వాహనాలు ఎదురుగా రావడాన్ని నిరోధించినట్లు తెలిపారు. పెదగంజాం నుంచి వచ్చే వాహనాలు అన్ని కూడా రాజుబంగారు పాలెం నుంచి హైవే వైపు మళ్లించినట్లు తెలిపారు. చీరాల నుంచి ఒంగోలు మధ్య తిరిగే ఆర్టీసీ బస్సులకు చినగంజాం గ్రామంలోనికి అనుమతి లేదని, టీ జంక్షన్ వద్ద మాత్రమే బస్సులు ఆగుతాయని తెలిపారు. ఈ నిబంధనలు మహాశివరాత్రికి పండుగకు వచ్చే ప్రజలు, భక్తులు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఉండే విధంగా ట్రాఫిక్‌ను మళ్లించినట్లు తెలిపారు. అందరూ పోలీసు సిబ్బందికి సహకరించాల్సిందిగా ఆయన కోరారు.

కోటప్పకొండకు ప్రత్యేక బస్సులు

అద్దంకి: మహాశివరాత్రి సందర్భంగా బుధవారం అద్దంకి డిపో నుంచి కోటప్పకొండకు 35 ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు డిపో మేనేరు రామమోహన రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అవసరం అయితే మరిన్ని బస్సు సర్వీసులు ఏర్పాటు చేస్తామని చెప్పారు. అదే విధంగా శ్రీశైలానికి 9 బస్సులు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ ప్రకటనలో పేర్కొన్నారు.

చీరాల నుంచి కోటప్పకొండకు 45 బస్సులు..

చీరాల అర్బన్: మహాశివరాత్రి సందర్భంగా కొటప్పకొండకు చీరాల ఆర్టీసీ డిపో నుంచి 45 బస్సులను నడుపుతున్నట్లు డిపో మేనేజర్ జే.శ్యామల మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోటప్పకొండకు బుధవారం ఉదయం నుంచి చీరాల ఆర్టీసీ బస్టాండ్ నుంచి ప్రతి 10 నిమిషాలకు ఒక బస్సు ఏర్పాటు చేశామన్నారు. అలానే చినగంజాం దగ్గర గల సోపిరాలకు రెండు బస్సులు ఏర్పాటు చేశామన్నారు.

నేడు మార్టూరులో శివరాత్రి జాగారం

మార్టూరు: మహాశివరాత్రి సందర్భంగా నేటి రాత్రి మార్టూరులో జాగారం కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక బొడ్డు రాయి సమీపంలోని ఘట్టేశ్వర స్వామి ఆలయంలో నేటి సాయంత్రం 6 గంటల నుంచి గురువారం ఉదయం 6 గంటల వరకు జాగారం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో మార్టూరు సాయికృష్ణ కోలాట బృందం వారిచే కోలాట ప్రదర్శన, లింగోద్భవ అభిషేకాలు, ధ్యానంతో పాటు మ్యూజికల్ నైట్ నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. ఘట్టేశ్వర స్వామి దేవస్థానం, శివదీక్ష స్వాముల ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాగారం కార్యక్రమాన్ని భక్తులు వినియోగించుకోవాలని వారు తెలిపారు.